1

నవతెలంగాణ

ఆదిలాబాద్

ఆదివారం | మే 05, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి : టీపీజేఏసీ

సారంగాపూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని తెలంగాణ పీపుల్స్ జేఏసీ ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జేఏసీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి సారిగా ఎంపీ టికెట్ మహిళ అయిన ఆత్రం సుగుణకు కేటాయించిందన్నారు. ఆమె కుటుంబం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీల కరపత్రాలను అందజేసి ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని రైతులను, రైతు కూలీలను, ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కొండల్, ఎంఎన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోతన్న, నర్సారెడ్డి, భూమన్న చిన్నయ్య, రాజన్న పాల్గొన్నారు.



లోక భూమారెడ్డి కాంగ్రెస్‌లో చేరిక

తలమడుగు : విజయ డైయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భూమారెడ్డి మాట్లాడుతూ రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీతోనే మొదలైందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో అనేక పదవులు చేపట్టి తెలంగాణ రాష్ట్ర సాధనలో పోరాటం చేశానన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, సోనియా గాంధీ తెలంగాణ ప్రజలకు కానుకగా ఇచ్చిందన్నారు. కాంగ్రెస్‌లో చేరడం అంటే సొంత గూటికి చేరినట్లుగా భావిస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌లో క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా పనిచేస్తానని తెలిపారు.



ఆగర్భ శ్రీమంతుడు, భూగర్భ కార్మికుడికి పోటీ

- మంచిర్యాల జిల్లాగా ఉండాలంటే కొప్పుల ఈశ్వర్ గెలవాలి
- రోడ్‌షోలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



నవతెలంగాణ-మంచిర్యాల

వందల కోట్ల సామ్రాజ్యం ఉన్న వ్యక్తులు ఒక వైపు, సింగరేణి కార్మికుడు ఒక్కడు ఒక వైపు ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా మంచిర్యాలలో రోడ్‌షోలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ కోట్లకు అధిపతి అయిన గడ్డం వంశీ, సింగరేణి కార్మికుడైన కొప్పుల ఈశ్వర్ పోటీ పడుతున్నారని, ఎవరు గెలిస్తే అభివృద్ధి చేస్తారో ఓటర్లు ఆలోచించాలని కోరారు. మంచిర్యాల జిల్లాగా ఉండాలంటే కొప్పుల ఈశ్వర్‌ను పెద్దపల్లి ఎంపీగా గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాగు, తాగు నీరు, కరెంట్ కనపడతలేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటింటికి నల్లా పెట్టి నీళ్లిచ్చామన్నారు. ఇయ్యాల సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మీ మాయం అయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుగాని ఆరు గ్యారెంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల నుండి రుణమాఫీ కాలే, రైతుబంధు రాలే, మహిళకు రూ.2500 జాడలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఫ్రీ బస్ స్కీమ్ ఆటో కార్మికుల పొట్ట కొట్టిందన్నారు. ఫ్రీ బస్ ఎఫెక్ట్‌తో బస్సుల్లో ఆడోళ్లు శిఖలు పట్టుకొని కొట్లాడుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఎక్కడికి పోయినా దేవుళ్ల మీద ఒట్టు పెట్టి హామీల వర్షం కురిపిస్తున్నాడని, కానీ ఒక్క హామీ కూడా అమలు చేస్తలేడని తెలిపారు. మున్సిపాలిటీలకు, పంచాయతీలకు ఫండ్స్ లేక చెత్తగా తయారయ్యాయన్నారు. రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తామని చెప్పి బోగస్ చేశారన్నారు. ఎలక్షన్ తెల్లారే జిల్లాలు రద్దు చేస్తామని మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. స్ట్రీట్ లైట్లు పోతే రిపేర్లు చేసే పరిస్థితి లేదని, కేసీఆర్ కిట్టు, విదేశీ విద్య సాయం ఇలా అన్ని బంద్ చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన అన్ని అభివృద్ధి పనులు ఆపేశారని తెలిపారు. కొప్పుల ఈశ్వర్ గెలిస్తే సింగరేణిని కాపాడుతాడన్నాడు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పోయి ఆదానీతో అగ్రిమెంట్ చేసుకున్నాడని, బీజేపీ ప్రభుత్వం వస్తే సింగరేణిని ప్రయివేట్‌పరం చేస్తారని తెలిపారు. గోదావరిని తీసుకుపోయి తమిళనాడుకు ఇస్తామన్నా కూడా సీఎం ఎందుకు నోరు మెదపట్లేదని ప్రశ్నించారు. కేసులకు, జైళ్లకు కేసీఆర్ భయపడనని, ఎన్నో కేసులు ఎన్నో ఉద్యమాలు చేసి తెలంగాణ ప్రజల బాగు కోసం తెలంగాణ తీసుకొచ్చానని తెలిపారు. తాను భయపడితే తెలంగాణ వచ్చేదా? ఒకసారి ప్రజలు గమనించాలని గుర్తు చేశారు. తెలంగాణకు అన్యాయం జరిగితే తన ప్రాణాలను అడ్డుపెట్టి అయినా ప్రజల కోసం కొట్లాడుతానని అన్నారు. నరేంద్రమోడీది ఉత్త గ్యాస్ కంపెనీ అని, బీజేపీకి ఓటేసినా గోదావరిలో వేసినా ఒకటే అని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో బీజేపీ అసలు పోటీనే కాదని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌కు మధ్యనే పోటీ ఉందని తెలిపారు. కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తే పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కొరకు పార్లమెంట్‌లో కోట్లాది అనేక నిధులు తీసుకొస్తామని, సింగరేణిని కాపాడుతామని తెలిపారు. రోడ్ షోలో పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు.



పదేండ్ల బీజేపీ పాలనలో మారని పేదల బతుకులు

- జిల్లాకు చేరుకున్న ఓటరు చైతన్య యాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదేండ్ల బీజేపీ పాలనలో పేదల బతుకులు ఏమాత్రమూ మారలేదని, ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. బీజేపీని ఓడించాలనే నినాదంతో చేపట్టిన బస్సు యాత్ర శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. పట్టణంలోని నేతాజీ చౌక్‌లో కార్మికులు, ప్రజలను ఉద్దేశించి వక్తలు ప్రసంగించారు. పదేండ్ల బీజేపీ పాలనలో తెలంగాణ, దేశ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర కన్వీనర్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడుతూ పేద ప్రజలకు పదేండ్ల పాలనలో బీజేపీ చేసిందేమీ లేదన్నారు. కేవలం బడా వ్యాపారులు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, పేద వారికి ఇండ్లు ఇస్తామని ఇవ్వలేదన్నారు. ఆదిలాబాద్‌లో ఏ ఒక్కరికి కూడా కేంద్ర ప్రభుత్వం నుంచి ఇండ్లు రాలేదన్నారు. ఇక్కడ అనేక సమస్యలున్నాయని తెలిపారు. ప్రధాన మంత్రి అభివృద్ధి చేస్తున్నారా లేక రాజకీయం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. యువత, ప్రజలు బీజేపీ పాలనపై ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శ్రీనివాస్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, నాయకులు కళావతి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, అరుణ్‌కుమార్, వెంకటనారాయణ, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకునూరి మురళీ



జిల్లాకు చేరుకున్న చైతన్యయాత్ర

కార్మిక సంక్షేమాన్ని మరిచిన గెలిచిన సంఘాలు

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచి నాలుగు నెలలైనా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పత్రాలు తీసుకోకుండా కార్మికుల హక్కులు, సంక్షేమం మరిచాయని సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్(హెచ్ఎంఎస్) ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. శనివారం మందమర్రి యూనియన్ కార్యాలయంలో బోనాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ ఏరియా నూతన ఉపాధ్యక్షుడిగా జక్కినబోయిన శ్రీనివాస్‌ను నియమించారు. ఏరియాలోని కెకె ఓసిపి యూనియన్ పిట్ కార్యదర్శి మౌనిక, సిఎస్పి పిట్ కార్యదర్శిగా చొప్పరి రామస్వామిని నియమించారు.

అనంతరం రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఏరియాకు రెండు గనులు వెంటనే కేటాయించాలని, తద్వారా ఏరియాలో ఎంప్లాయిమెంట్ పెరుగుతుందని తెలిపారు. గతంలో మాదిరిగా పరుగు పందెం నిర్వహించి, నూతన ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో 60వేల క్వార్టర్లు ఉంటే కార్మికులు 40వేలు మాత్రమే ఉన్నారని, మిగిలిన 20వేల క్వార్టర్లు ఎటుపోయాయని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల సిఫార్సుతో సింగరేణికి సంబంధం లేని వ్యక్తులకు మంచి క్వార్టర్లు కేటాయిస్తూ, కార్మికులకు రిజెక్టెడ్ క్వార్టర్లు ఇస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సర్ఫేస్ డిప్యూటేషన్ల దందా కొనసాగుతుందని, సర్ఫేస్‌లో ఖాళీలు ఉంటే సీనియర్ అండర్ గ్రౌండ్ కార్మికులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ జోక్యంతో గత గుర్తింపు సంఘం కనుమరుగైందని, ఇప్పుడు ఐఎన్టీయూసీ అదే రాజకీయ జోక్యాన్ని కొనసాగిస్తే వారికి కూడా అదే శాస్తి జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెల్దీ సుదర్శన్, ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, ముఖేష్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, నాయకులు అనిల్‌రెడ్డి, నామాల శ్రీనివాస్, కొమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎండి గౌస్ పాల్గొన్నారు.



పఠన నైపుణ్యం అలవాటు చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో పఠన నైపుణ్యం అలవాటు చేయడం ద్వారా వారిలో మౌఖిక భాష వికాస అభివృద్ధి, అభ్యసన సామర్థ్యాలను సాధించవచ్చని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో అభ్యసన కొనసాగింపు కొరకు రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్, జిల్లా విద్యాశాఖ వారి సహకారంతో రూపొందించిన 040-4520-9722 నెంబర్‌ను డయల్ చేయడం ద్వారా వివిధ స్థాయి విద్యార్థులకు ఆకర్షణీయమైన, అభిరుచి కలిగించే తెలుగు కథలు లభ్యమవుతాయని తెలిపారు. ఇవి విద్యార్థుల్లో చదవడం అలవాటుతో పాటుగా శ్రవణ, ఆలోచన నైపుణ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. అందువల్ల 040-4520-9722 నెంబర్‌కు డయల్ చేయడం ద్వారా పిల్లల్లో నేర్చుకునే ఆసక్తి, ఆనందం కలిగించే కథలు హాయిగా వినవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని, వారి వికాసానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ డయల్ నెంబర్‌ను జిల్లా స్థాయి అధికారులకు, అందరికీ అందుబాటులో ఉండే విధంగా వాట్సప్ గ్రూప్‌లో ప్రచారం చేయాలని విద్యాశాఖ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారిణి ప్రణీత, ఏఎంఓ శ్రీకాంత్‌గౌడ్, ఎస్ఓ ప్లానింగ్ నారాయణ, సొహైల్, రూమ్ టు రీడ్ జిల్లా ఇన్చార్జి శ్రీకాంత్, టీం సభ్యులు చంద్రశేఖర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సుగుణక్కను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనదే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పార్లమెంటు స్థానానికి మొట్టమొదటిసారిగా ఒక గిరిజన మహిళా నాయకురాలు ఆత్రం సుగుణక్కకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించడం జరిగిందని, నాయకురాలిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సుగుణక్కకు మద్దతుగా శనివారం జిల్లా కేంద్రంలోని 9వార్డ్ దుర్గానగర్, శంకర్‌గుట్ట కాలనీల్లో ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ మేనిఫెస్టో అంశాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంటు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా, మహిళకు పార్లమెంటు సీటును కేటాయించడం జరిగిందన్నారు. మానవ హక్కుల కోసం, ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిన సుగుణ మహిళలందరికీ ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. ప్రచారంలో భాగంగా ఏ గ్రామానికి, వార్డుకు వెళ్లినా మహిళల నుండి అనూహ్య స్పందన లభిస్తోందని, ఈ మారు తమ ఓటు సుగుణక్కకే అంటూ చెబుతున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో ఈ సారి కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లు సాధించి అధికారం చేపడుతుందని, మే 13న జరగనున్న ఎన్నికల్లో బ్యాలెట్‌లో 2నెంబర్ పై ఉన్న చేతి గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ రహీమ్‌ఖాన్, లింగన్న, దురువ నాని, బస్వాంతే విష్ణు, భీంరావు, కుమ్రే విష్ణు, నాగరాజు, రంజిత్‌రెడ్డి, వెంకటేష్, చంటి, మద్దెల శ్రీను, ఫెరోజ్‌ఖాన్, అడెల్లు, ప్రశాంత్, అనిల్, హక్కీ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్



నవతెలంగాణ-సిరికొండ

ఆరు గ్యారంటీలతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బిఆర్ఎస్ మండల నాయకుడు ఒరగంటి పెంటన్న అన్నారు. శనివారం మండలంలోని సోంపల్లి, దోబిగూడ, ఇటికర్‌గూడ గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూర్యకాంత్, రాజన్న రోహిదాస్, తులసీదాస్, నర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని అంకోలి గ్రామంలో శనివారం పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. పదేళ్ల అధికారంలో ఉండి ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఇండ్లిచ్చిందా, భూములిచ్చిందా, ఉద్యోగాలిచ్చిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే గతంలో ఇండ్ల స్థలాలు, భూములిచ్చిందని గుర్తు చేశారు. తిరిగి అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, చేతి గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే ఆదిలాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని సుగుణ ప్రజలకు విన్నవించారు. కొంగు చాచి అడుగుతున్న ఒక్కసారి తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పకడ్బందీగా హోం ఓటింగ్ : కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటి నుంచి ఓటు సేకరించే(ఓట్ ఫ్రమ్ హోమ్) ప్రక్రియను ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం హోమ్ ఓటింగ్ ప్రక్రియలో భాగంగా జీఎస్ ఎస్టేట్‌లోని ఓ ఇంట్లో వయోవృద్ధురాలు ఆకుల పార్వతమ్మ హోం ఓటింగ్ వినియోగించుకున్న ప్రక్రియను కలెక్టర్ రాజర్షి షా దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల బృందాలు రూట్ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఓటును సేకరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా, ఇంటి వద్ద నుండే ఓటు వేసేలా ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేవడం వల్ల సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఎంతో వెసులుబాటు లభించిందని పేర్కొన్నారు. హోమ్ ఓటింగ్ కోసం నియమించబడిన బృందాలు ఆయా రూట్లలో తిరుగుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నాయని, ఓటర్ల ఇళ్ల వద్దనే ఓటింగ్ కంపార్ట్మెంట్‌ను ఏర్పాటు చేసి, ఓటు గోప్యతకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా, వీడియో చిత్రీకరణలతో ఓటింగ్ ప్రక్రియను జరిపిస్తున్నామని తెలిపారు.

అడవి పంది దాడిలో రైతు మృతి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన రైతు బాలయ్య(63) అడవి పంది దాడిలో మృతి చెందాడు. గేదెలను మేపడానికి శనివారం ఉదయం గ్రామ శివారులోని వాగు వద్దకు వెళ్లాడు. అడవి పంది ఒక్కసారిగా దాడి చేసి అతడిని తీవ్రంగా గాయపరచడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రైతు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. అడవి పంది దాడితో గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలో 12మంది హోమ్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖానాపూర్ పట్టణంలో 5 గురు, సత్తనపెల్లిలో ముగ్గురు, తర్లాపాడ్‌లో ఇద్దరు, పాతెల్లాపూర్, బాదనకుర్తి గ్రామాల్లో ఒక్కొక్కరు తమ ఓటు వేశారు. నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులు, 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఎన్నికల కమిషన్ ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించింది. ఈ క్రమంలో శనివారం సదరు ఓటర్లు పీఓ, ఏపీఓ సమక్షంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని బర్కత్‌పురా కాలనీకి చెందిన 91 సంవత్సరాల వృద్ధురాలు ఖాజా భేగం తన ఓటును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంధం రాజేశ్వర్, బీఎల్ఓ వరలక్ష్మి పాల్గొన్నారు.



కాళ్లు మొక్కుతూ... ఓట్లు అడుగుతూ...

నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కాళ్లు మొక్కుతూ నాగాపూర్ మాజీ సర్పంచ్ సునీల్ జాదవ్ ఓట్లు అభ్యర్థించారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని ఎక్స్‌రోడ్డు, సేవాదాస్ నగర్, భీమ నాయక్ తండతో పాటు పలు ప్రాంతాల్లో తిరుగుతూ ఆత్రం సుగుణకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినోద్, అజయ్ ఉన్నారు.



పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పార్లమెంట్ ఎన్నికలలో పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అన్ని రకాల వసతులు కల్పించాలని తపస్ అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ చవాన్, వలబోజు గోపికృష్ణ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో అన్ని రకాల వసతులు కల్పించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కూలర్ల ఏర్పాటు, సరైన రవాణా సదుపాయం, భోజన వసతి, పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని, రెమ్యునరేషన్ చెల్లించే విషయంలో అంతటా ఒకే రకమైన నిబంధనలు పాటించాలని కోరారు.



మోసపూరిత హామీలిస్తున్న కాంగ్రెస్, బీజేపీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మోసపూరిత హామీలతో కాంగ్రెస్, బీజేపీలు మళ్లీ ప్రజల వద్దకు వస్తున్నారని, వారిని నమ్మవద్దని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున పట్టణంలోని కేఆర్కే కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ బీఆర్ఎస్ హయంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన 13 హామీల్లో కాంగ్రెస్ ఒక్కటే నేరవేర్చిందన్నారు. వంద రోజుల పాలనలో మిగితా వాటి ఊసే లేదన్నారు. అటు బీజేపీ పాలనలో గ్యాస్, పెట్రోల్ ధరలు పెరిగాయన్నారు. ఆదిలాబాద్ సీసీఐ, ఎరోడ్రమ్, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదన్నారు. వీటిపై గతంలో కేంద్ర మంత్రులు హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలుపొందిన తరువాత విస్మరించారని ఆరోపించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గోంతుక అయిన ఆత్రం సక్కును కారు గుర్తుకు ఓటేసి బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ది చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, సాజిదోద్దీన్, కోవ రవి, దాసరి రమేష్, భరత్, సత్యనారాయణ, స్వరూప పాల్గొన్నారు.

ఆత్రం సుగుణకు ఆదివాసుల మద్దతు

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో ఆదివాసుల హక్కుల కోసం, చట్టాల పరిరక్షణకు, పోరాటాలు నిర్వహించిన ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణకు ఆదివాసుల మద్దత్తు ఉంటుందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన టీఏజీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆత్రం సుగుణకు మద్దత్తు తెలియ జేస్తూ ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పూసం సచిన్ హాజరై మాట్లాడుతూ బీజేపీ పదేండ్ల పాలనలో ఆదివాసీ చట్టాలను నీరుగార్చడం, షెడ్యూల్ ప్రాంతాలను ఎత్తివేసి అడవిని ప్రయివేట్ కంపెనీలకు అప్పజేప్పెందుకు నూతన విధానాలు తీసుకొచ్చిందన్నారు. ఆదివాసుల హక్కులకై, వారి చట్టాల పరిరక్షణకై నిరంతరం పోరాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించి, ఆదివాసుల గొంతుకను పార్లమెంట్‌కు పంపాలని, ఆదిలాబాద్ లోక్‌సభ చరిత్రలో మొదటి సారి ఆదివాసీ మహిళా పోటీ చేస్తున్న సందర్భంగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. టీఏజీఎస్ కార్యకర్తలు ఆత్రం సుగుణ గెలుపునకు అన్ని మండలాల్లో ప్రచారం చేయాలనీ కోరారు. ఉమ్మడి జిల్లా ప్రజలు నిరంతరం ప్రజల కోసం నిలబడ్డ ఆమెను భారీ మెజారిటీతో గెలిపించి, మతోన్మాద, ఆదివాసీ వ్యతిరేక బీజేపీ, బీఆర్ఎస్‌లను లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, నిర్మల్ జిల్లా కార్యదర్శి తొడసం శంబు, కుమురంభీం జిల్లా అధ్యక్షులు మాలశ్రీ, ఉపాధ్యక్షులు మెస్రం మహేష్, తుంరం ఈశ్వర్, మెస్రం నర్మధ, కోవా శకుంతల, సహాయ కార్యదర్శులు వెట్టి గణేష్, కనక మలుకు, ఉమ్మడి జిల్లా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పైడిపల్లి రాజీనామా



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పైడిపల్లి రవీందర్‌రావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ బాధ్యుల అనుచిత వైఖరి వల్ల నిర్లక్ష్య ధోరణికి నిరసనగా తాము పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు పనులు చేయకుండా పార్టీలో ఉండటం కన్నా వెళ్లిపోవడమే మంచిదని అన్నారు. వీరి వెంట పలువురు సీనియర్ నాయకులతో పాటు మరో 50 మంది క్రియాశీల నాయకులు రాజీనామా చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు సాగి లక్ష్మణరావు, కారింగుల రాములు, ఎన్నమనేని సుధాకర్‌రావు, జల్లె భీమయ్య, కొత్తపల్లి సురేష్, కొండారి గంగారావు, కే.శ్రీనివాసరావు, సంజీవరావు నర్సయ్య ఉన్నారు.

ఓటు వినియోగించుకున్న పోలీస్ సిబ్బంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విధులలో ఉన్న పోలీస్ సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదిలాబాద్ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా శనివారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసిన వారిలో ఏఎస్సై ముకుంద్‌రావ్, సుధాకర్‌రెడ్డి, నరేందర్, ఆశన్న, ప్రవీణ్, క్రాంతి, యూసుఫ్ ఉన్నారు.

ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంటు ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వీప్ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్లు తమ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈ నెల 13న నిర్వహించనున్న పోలింగ్‌లో జిల్లాలోని ఓటర్లందరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఓటు హక్కు అనేది ప్రజలందరికీ రాజ్యాంగం కల్పించిన గొప్ప వరమని, ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్ జెండర్‌లు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని ఆదర్శంగా నిలువాలని కోరారు. పోలింగ్ కేంద్రాలలో వికలాంగుల కోసం ర్యాంప్, వీల్ చైర్స్ వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వికలాంగులకు, 85 సంవత్సరాల వయసు పైబడిన వృద్ధులకు హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పించినట్టు తెలిపారు. జిల్లాలో 636 మందికి హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించడం జరిగిందని అన్నారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేలా స్వీప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విస్తృతం చేయాలనీ సూచించారు. అనంతరం ట్రాన్స్ జెండర్స్‌కి కలెక్టర్ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి కే.నాగమణి, అధికారులు, సిబ్బంది, వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ఎమ్మెల్యే ప్రచారం



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలో మార్నింగ్ వాక్‌లో భాగంగా శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పలు వార్డులలో ప్రజల వద్దకు వెళ్లి ఎంపీ అభ్యర్థి సుగుణకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అంతేకాకుండా మండలంలోని బాదనకుర్తి గ్రామంలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచారంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం, మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, నాయకులు తోట సత్యం, మజీద్, గంగాధర్, రాజేశ్వర్, జన్నరాపు శంకర్, నేరేళ్ల సత్యనారాయణ, గంగ నర్సయ్య, గొర్రె గంగాధర్, బక్కశెట్టి కిషోర్, రాజేందర్, శేషాద్రి, లక్ష్మిపతి, రాజేందర్, పరంకుశం శ్రీనివాస్, జహీర్ ఖాన్, హైమద్, శ్రీనివాస్, సౌకత్ పాషా, మీర్జా, జుని, నాయింఖాన్, జహీర్ పాల్గొన్నారు.

ఎండలో సైతం ప్రచారం



నవతెలంగాణ-ఇచ్చోడ

రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నాయకులు మాత్రం ఎండలను సైతం లెక్కచేయకుండా జోరుగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. శనివారం బీఆర్ఎస్ నాయకులు ముండే పాండురంగ్ ఆధ్వర్యంలో మండలంలోని గేర్జం గ్రామంలో ఇంటింటికి, వెళ్లి ప్రతి ఓటరుకు కలిసి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ముండే పాండురంగ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి కారుగుర్తకు ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జుగ్నాక్ గంగారాం, మహమూద్ ఖాన్, ఆనంద్, ఆశన్న పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వం లేనోళ్లకు ఎంపీ టికెట్లా..?

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



నవతెలంగాణ-కుభీర్

చరిత్ర గల్గిన పార్టీలని చెప్పుకునే బీజేపీ, కాంగ్రెస్, పార్టీలకు పార్టీ సభ్యత్వమైన లేని అభ్యర్థులకు ఎంపీ టికెట్లు ఇవ్వడం సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి అత్రం సక్కు విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని బాలాజీ జిన్నింగ్ మిల్లులో మండల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి అత్రం సక్కు, మాజీ మంత్రి జోగు రామన్న, మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి బలపరిచిన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలోఉన్న వాళ్లకు కనీసం పార్టీ సభ్యత్వం అయినాలేదని విమర్శించారు. ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకీ అభ్యర్థులు దొరక్క బీఆర్ఎస్ నుంచి వచ్చిన 8మందికీ ఎంపీ టికెట్లను ఇచ్చిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్తకు రూ.4వేలు, కోడలికి రూ.2వేల 500 అంటూ సాధ్యం కానీ హామీలు ఇచ్చి గద్దెక్కిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కూడా పక్కాగా అమలు చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లోలం శ్యాంసుందర్, డాక్టర్ కిరణ్, పడకంటి రమాదేవి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎన్నిల అనిల్, రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, వైస్ ఎంపీపీ మోహినొద్దీన్, పార్లమెంట్ నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-కడెం

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో ఇటీవల బీఆర్ఎస్ పార్టీ కడెం మండలాధ్యక్ష పదవికి రాజీనామా చేసిన జొన్నల చంద్రశేఖర్ గుప్తా తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేష్ యాదవ్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నిర్మల్ జిల్లా యూత్ అధ్యక్షులు పొద్దుటూరు సతీష్‌రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తి లేదు

- రాజ్యసభ సభ్యులు మధన్ సింగ్ రాథోడ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తామని, రిజర్వేషన్లు రద్దు చేస్తామని వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని, రాజ్యాంగాన్ని మార్చే ప్రసక్తి లేదని, రాజ్యసభ సభ్యులు మధన్ సింగ్ రాథోడ్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ ప్రవాసీగా ఆయన శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హయంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమ ప్రభుత్వం దుష్ప్రచారం చేయడానికి అస్త్రలు లేవన్నారు. అందుకే బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారని, రిజార్వేషన్లు రద్దు చేస్తారని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు తమ వైపు ఉన్నారని, అబద్దలను ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పార్టీలో అసమ్మతి లేదని, కొత్త, పాత క్యాడర్ అంత కలిసి పార్లమెంట్ అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో 400 సీట్లు సాధించి అధికారాన్ని చేపడుతామన్నారు. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావ్ మాట్లాడటం జరిగిందని, ఆయన కూడా పార్టీ నిర్ణయాలకు కట్టుబడి అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్టు వెల్లడించారు. ప్రజలు తమను ఆశీర్వాదించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను శనివారం ఎస్పీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఓటింగ్ సరళి గురించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, సాఫీగా జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. ఓటరు హెల్ప్ లైన్ కౌంటర్ వద్దనే ఓటరు జాబితాలోని క్రమ సంఖ్య, పార్ట్ నెంబర్‌ను చెక్ చేసుకోవాలని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు ఈ నెల 8 వరకు నిర్వహించు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏపీఓ, ఓపీఓ, పీఓలకు వేరు వేరుగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉచిత సాఫ్ట్‌బాల్ శిక్షణ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గోడం జ్యోతిరామ్ ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఉచిత సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఉచిత సాఫ్ట్‌బాల్ మెలుకువలు నేర్చుకోవాలని. ఈ శిక్షణ నేల రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ శిక్షణ నేరడిగొండ జెడ్పీఎస్ఎస్ గ్రౌండ్‌లో ఉంటుందని తెలిపారు. జాతీయ స్థాయి క్రీడాకారులు బంగారు పతకాలు సాధించిన వారు ఎం.అరుషి, అక్షితలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు గస్కంటి గంగాధర్, సాఫ్ట్‌బాల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, నెట్‌బాల్ సెక్రటరీ జి.మోహన్, ఎన్ఐఎస్ కోచ్ అఖిల, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేపటి నుంచి ప్రారంభం కానున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రంగా ఉండటంతో వడదెబ్బలు తగిలే అవకాశాలున్నాయని అన్నారు. వాతావరణ శాఖ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన కూడా రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ పరీక్షలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించి డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఏ ఒక్క విద్యార్థిని విద్యార్థి కైనా ఎండ తీవ్రత వల్ల అనారోగ్య పరిస్థితులు ఏర్పడినట్లయితే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎర్రజి హరీష్, సహాయ కార్యదర్శి కె.దత్తాత్రి, జిల్లా నాయకులు శ్రీకర్, ప్రతమేశ్, లింగు ఉన్నారు.

3

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

ఆదివారం | మే 05, 2024 | www.navatelangana.com

నాలుగు నెలల్లో 104 కేసులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో జనవరి నుంచి ఏప్రిల్ వరకు నాలుగు నెలల కాలంలో నాటు సారాయి స్థావరాలపై దాడులు నిర్వహించి 109 కేసులు నమోదుచేసినట్టు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. 55 మందీ నేరస్తులు అరెస్ట్ చేసి, 382 లీటర్ల నాటు సారాయి, నాటు సారాయి తయారీలో వాడే 640 కేజీల బెల్లం, 70 కేజీల పటికను, నాటు సారాయి రవాణా చేస్తున్న 13 ద్విచక్రవాహనాలను స్వాధీన పర్చుకుని, 65,700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 33 మంది పాత నేరస్తులను బైండోవర్ చేశామని పేర్కొన్నారు. నాటుసారాయి అమ్మిన, తయారు చేసిన నాటు సారాయి కేసులతో పాటు బైండోవర్ ఉల్లంఘన కేసులు, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లారీ ఢీకొని మూడు గేదెలు మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బురుగూడ గ్రామ సమీపంలోని బీఈడీ కళాశాల దగ్గర జాతీయ రహదారిపై శనివారం ఉదయం లారీ ఢీకొని మూడు గేదాలు మృతి చెందాయి. చిర్రకుంట గ్రామానికి చెందిన మద్దెల రాజన్న గెదలు మేతకోసం రహదారి దాటుతుండగా మహారాష్ట్ర నుండి అనంతపూర్ వెళ్లే లారీ నాలుగు గేదెలను ఢీ కొట్టింది. మూడు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో గేదెకు తీవ్రగాయాలు అయ్యాయి. నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరారు.

ఆర్టీసీ కార్మికుకు పీఆర్సీ బాండ్ల డబ్బులు చెల్లించాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు దివాకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ కార్మికులందరికీ 2013 పీఆర్సీ ఏరియర్స్ బాండ్ డబ్బులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్ డిమాండ్ చేశారు. పీఆర్సీ ఏరియర్స్ బాండు డబ్బులు డ్రైవర్లకు మాత్రమే చెల్లించి మిగతా వారికి చెల్లించకపోవడం పట్ల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కార్మికులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తెలంగాణ రాష్ట్ర సాధనలో అత్యంత కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికులు అన్ని విధాల నష్టపోయారన్నారు. డ్రైవర్లకు మాత్రమే బాండ్ల డబ్బులు ఇచ్చి మిగతా వారికి ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికుల అందరికీ బాండ్ల డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. సీసీఎస్, రావాల్సిన బకాయిలు చెల్లించాలని, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆసిఫాబాద్ డిపో అధ్యక్షుడు అశోక్, ఆర్టీసీ కార్మికులు అలీ, సంతోష్, నాగభూషణం, అమీద్, అశోక్ పాల్గొన్నారు.

సాంబర్ దుప్పిని కాపాడిన అటవీ అధికారులు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

అటవీ కుక్కలు సాంబరుదుప్పిని తరుముతుండగా అటవీ శాఖ వాచర్లు లచ్చయ్య, సాగర్‌కు కనిపించడంతో వెంటనే కుక్కలను తరిమివేసి సాంబరుదుప్పిని కాపాడారు. శనివారం ఉదయం వాచర్లు అటవీ ప్రాంతంలోకి వెళ్లగా అగర్‌గూడ గ్రామ సమీపంలో గల బొక్కివాగు వద్ద అటవీ కుక్కలు సాంబరుదుప్పిని తరమగా దానికి కుక్కల బారి నుండి వారు రక్షించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. బీట్ అధికారి వెంకటేష్ సాంబరుదుప్పిని పరిశీలించి క్షేమంగా ఉన్నట్టు నిర్ధారించుకొని అగర్‌గూడ అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. అటవీ జంతువులు జనవాసాల్లో వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని బీట్ అధికారి వెంకటేష్ ప్రజలను కోరారు.

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-రెబ్బెన

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని రెబ్బెన, పుంజుమేర గూడ, నక్కలగూడ, సింగల్ గూడ గ్రామాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను ఉదయం పని ప్రదేశంలో కాంగ్రెస్ నాయకులు 5 న్యాయ సూత్రాలను వివరించి చేతి గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలో వస్తేనే పేదలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతాయని తెలిపారు. కేంద్రంలో అధికారంలోనికి వచ్చిన వెంటనే ఉపాధి హమీ కూలీ 400కు పెంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్యా రమేష్, జడ్పీటీసీ వేముర్ల సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, సీనియర్ నేత, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్, ఎంపీటీసీ పెసరి మధునయ్య, టౌన్ అధ్యక్షుడు వనమల మురళి, సీనియర్ నాయకులు మడ్డి శ్రీనివాస్, మోడెం చిరంజీవి గౌడ్, గోగర్ల రాజేష్, మోడెం రాజేంద్ర ప్రసాద్ గౌడ్, అజ్మీర అశోక్, వడై నగేష్ పాల్గొన్నారు.

ఆత్రం సక్కును గెలిపించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్, మాజీ వైస్ ఎంపీపీ సలీమోద్దీన్ అన్నారు. శనివారం ఉట్నూర్ పట్టణంలో పలు వీధుల్లో తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుస్తూ బీఆర్ఎస్ హాయంలో జరిగిన అభివృద్ధిని వివరించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. రైతుబంధు, పోడు భూముల పట్టాలు అందరికీ లభించాలంటే ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. పదేండ్లు అధికారంలో ఉండి పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేశామని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామగిరి వాసు, ముజీబ్ ఖాన్, ఆసిఫ్, అలీం, సౌకత్, అలీ, కామెరి, రాజు, శ్రీకాంత్, జవీద్, వినోద్ పాల్గొన్నారు.



ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలి

- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల నిర్వహణలో ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ చాలా ముఖ్యమైనదని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాలలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియను సహాయ ఎన్నికల అధికారి దాసరి వేణుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు, నోటాతో కలిపి 13 బటన్లు ఓటింగ్ యంత్రంలో పనిచేసేలా చూడాలన్నారు. మిగతా బటన్లకు సీలు వేయాలన్నారు. ఓటింగ్ యంత్రంపై అభ్యర్థుల వివరాలు, గుర్తులు స్పష్టంగా కనపడేలా ఉండాలని సూచించారు. ఓటింగ్ యంత్రాలలో ప్రతి ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో కమిషనింగ్ ప్రక్రియ చాలా ముఖ్యమైనదన్నారు. ప్రతి యంత్రం పనిచేసేలా చూడాలన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి దాసరి వేణు మాట్లాడుతూ నియోజకవర్గంలో 356 పోలింగ్ కేంద్రాలకు గాను కమిషనింగ్ ప్రక్రియ



కాగజ్‌నగర్‌లో ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ఆసిఫాబాద్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నిర్వహించేందుకు 51 టేబుళ్ళు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి టేబుల్‌కు సెక్టార్ అధికారులు ఇన్‌ఛార్జిగా ఉండి కమిషనింగ్ చేపడుతారని తెలిపారు. కమిషనింగ్ అనంతరం ఓటింగ్ యంత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ లోకేశ్వరరావు, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : ఎన్నికల నిర్వహణలో ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియ చాలా ముఖ్యమైందని, దీనిని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో సిర్పూర్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలకై ఏర్పాటు చేసిన ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను శనివారం సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటింగ్ యంత్రాలలో ప్రతి ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలన్నారు. ఎలాంటి తప్పులు జరుగకూడదన్నారు. ప్రతి యంత్రం పనిచేసేలా చూడాలన్నారు. సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారి మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో 320 పోలింగ్ కేంద్రాలకు గాను కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు 40 టేబుళ్ళు ఏర్పాటు చేశామని తెలిపారు. కమిషనింగ్ అనంతరం ఓటింగ్ యంత్రాలను స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కాశబోయిన సురేష్, తహసీల్దార్లు, సెక్టార్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పని వేళల్లో మార్పు చేస్తూ సర్క్యులర్ ఇవ్వాలి

- ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి

నవతెలంగాణ-రెబ్బెన

గతంలో ఎన్నడు లేని విధంగా కోల్‌బెల్ట్ ఏరియాలో ఎండలు మండుతున్నాయని దీని కారణంగా ఓపెన్ కాస్టు గనులు, సీఎస్‌పీ, సీహెచ్‌పీలలో పని చేస్తున్న కార్మికులు ఎండవేడికి అస్వస్థతకు గురవుతున్నారని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు మొగిలి అన్నారు. శనివారం ఖైర్‌గూడ ఓపెన్ కాస్ట్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జులు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరరు వారు మాట్లాడుతూ ప్రస్తుతం కోల్‌బెల్ట్ ఏరియాలో ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయన్నారు. దీని కారణంగా ఓపెన్ కాస్ట్ గనులు, సీఎస్‌పీ, సీహెచ్‌పీలలో పనిచేస్తున్న కార్మికులు ఎండవేడికి అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. గతంలో ఏప్రిల్ నెల సమీపించగానే యాజమాన్యం ఎండలను దృష్టిలో ఉంచుకుని కార్మికులు అనారోగ్యానికి గురి కాకుండా డ్యూటీ టైమింగ్స్‌ని తగ్గించి మొదటి, రెండవ షిఫ్టులలో కార్మికులు అస్వస్థతకు ప్రమాదానికి గురి కాకుండా పని వేళలు మారుస్తూ సర్క్యులర్ జారీ చేసి, ఎండలు తగ్గుముఖం పట్టేదాకా అమలు చేసేవారని తెలిపారు. కానీ ప్రస్తుతం యాజమాన్యానికి ఈ విషయం కోరిన పట్టించుకోలేదన్నారు. కార్మికులకు ఏమైనా



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జరిగితే యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. దివాకర్, మీస చంద్రశేఖర్, కమిటీ సహాయ కార్యదర్శి ఓదెలు, సభ్యులు అన్నం రాజకుమార్, అల్లాడి కోటీ సుధీర్, రాంకిషన్, కుమారస్వామి, మహేందర్, మల్లేశ్వరి, సుజాత, బిజిలీ బాయి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించండి : రావి శ్రీనివాస్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని పారిగాం గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం వంద రోజుల ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్‌దేనని, పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే ఏకైక పార్టీ అన్నారు. ఈ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాటం చేసే ఆత్రం సుగుణను ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి చట్టసభలకు పంపాలని యిఎవఎఱ. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఐదు న్యాయాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, హుడ్కిలి మాజీ సర్పంచ్ ఇప్పె ప్రభాకర్, చౌదరి నానాజీ, మండల వ్యవసాయ శాఖ ఉపాధ్యక్షుడు లెండుగురె శంకర్, సంజీవ్ పాల్గొన్నారు.

ధాన్యం నిల్వలేకుండా తరలించాలి : కలెక్టర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రైతుల వద్ద కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని నిల్వలేకుండా ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రె ఆదేశించారు. శనివారం మండలంలోని సీతానగర్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండ వేడిమి అధికంగా ఉన్నందున రైతులు, నిర్వహకులు తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలు లేకుండా చూడాలన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడువకుండా ముందస్తు జాగ్రత్తగా టార్పలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతుల నీడకు షామియానాలు, చల్లని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని నిర్వహకులను ఆదేశించారు. నాణ్యత కలిగిన ధాన్యాన్ని తీసుకరావాలని, తేమతో పాటు తాలు, పొల్లు లేకుండా చూడాలని రైతులకు సూచనలిచ్చారు. వరిధాన్యం కొనుగోళ్లలో ఏవైనా సమస్యలుంటే రైతులు తన దృష్టికి తీసుకరావాలని చెప్పారు. వరిధాన్యం కొనుగోళ్లలో ఏవైనా సమస్యలున్నాయా ..? అని రైతులను, నిర్వహకులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నిర్వహకులు ముక్తార్, సతీష్, రోహిణి, రైతులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని గుంట్లపేట్, ఎల్లూరు, కొండపెల్లి గ్రామాల్లో



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార ఆడిట్ అధికారి మహమూద్ అలీ, సిర్పూర్ అధికారి శ్యాముల్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీవిద్య, శ్రీధర్, వరి కొనుగోలు కేంద్రం సెంటర్ ఇన్‌చార్జిలు సత్యనారాయణగౌడ్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలకు కరపత్రాలు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రచారంలో మండల నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు తరపున మండల నాయకులు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న చోటకు వెళ్లి కూలీలకు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరిస్తు కరపత్రాలను పంపిణీ చేశారు. అదే విధంగా మండలంలోనీ నంబాల, జక్కులపెల్లి గ్రామాలలో పాటు పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటేసి పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న చేసిన అభివృద్ధిని చూసి పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

పూరీలు వేస్తూ..ముంజలు తీస్తూ ఓట్ల అభ్యర్థన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కలియ తిరుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. ఇదే సందర్భంలో మార్కెట్‌లోని పలు హోటళ్లలో పూరీలు వేశారు. అలాగే తాటి ముంజలు అమ్మే దగ్గరికి వెళ్లి వాటిని తీసి ఓటు అభ్యర్థించారు. టైలర్ షాప్‌లో మిషన్ కుట్టారు. ఇలా వివిధ రకాలుగా నాయకులతో కలిసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇచ్చిన జిల్లా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి పనిచేస్తానని తెలిపారు. అదే నమ్మకంతో పార్లమెంట్ అభ్యర్థి, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భీమేష్, కార్తీక్, అశోక్, నిసార్ పాల్గొన్నారు.

నేటి రాష్ట్ర స్థాయి సమావేశం విజయవంతం చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించే బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి భవిష్యత్తు కార్యాచరణ, ఇతర అంశాలపై రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. బీసీల ఐక్యత తెలిపే విధంగా ప్రతి ఒక్కరు సమావేశానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం బాలేష్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్, రైతు అధ్యక్షులు వైరాగడే మారుతీ పటేల్, రైతు ఉపాధ్యక్షులు గడ్డల శంకర్, బాల్దరపు మధుకర్ పాల్గొన్నారు.

ఒకే వివాదంలో ఇద్దరు మహిళల ఆత్మహత్య

నవతెలంగాణ-సిర్పూర్(టి)



దోని సరిత(ఫైల్)



గాజిరెడ్డి రమా(ఫైల్)

ఒకే గొడవలో ఇద్దరు మహిళలు వాస్మల్ హెరాయిల్, గన్నేరు రసం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని బెస్తవాడలో జరిగింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన దోని సరిత(30) వీరి ఇంటికి ఎదురుగా ఉన్న గాజిరెడ్డి సురేష్ భార్య రమా(35)కు లేనిపోని మాటలు చెప్పిందని అందువల్లనే వారికి గొడవలు జరుగుతున్నాయని గాజిరెడ్డి సురేష్ తల్లి గుండమ్మ, చెల్లెలు పద్మ సరితతో తరచూగా గొడవలు పడేవారు. గాజిరెడ్డి సరేష్ అతని భార్య రమా(35)కు ఈ మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల మూడో తేదీన అర్ధరాత్రి సమయంలో గన్నేరు రసం తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతిచెందింది. ఈ మృతికి కారణం నువ్వేనని గాజిరెడ్డి సురేష్ తల్లి, చెల్లెలు కలిసి వాడలో ఉన్న స్థానికుల ముందు దోని సరితతో గొడవ చేశారు. అవమానాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన సరిత శనివారం ఉదయం ఇంటిలో ఉన్న సూపర్ వాస్మల్ హెరాయిల్ తాగి వాంతులు చేసుకుంది. గమనించిన భర్త దోని రాజేందర్ సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త దోని రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రాములు తెలిపారు.

భర్త వేదింపులతో భార్య ఆత్మహత్య...

మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన గాజిరెడ్డి రమా(35) భర్త గాజిరెడ్డి సురేష్ వేదింపులు భరించలేక గన్నేరు రసం తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. మృతురాలి తల్లి ఒడ్డేటి పోశక్క, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిర్పూర్ గ్రామానికి చెందిన గాజిరెడ్డి సురేష్‌తో 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. కొన్ని సంవత్సరాల నుండి భర్త గాజిరెడ్డి సురేష్ తన కూతురిని అనుమానంతో ఎవరితో మాట్లాడిన అక్రమ సంబంధం ఉందంటూ తరచూ గొడవలు చేస్తూ కొడుతుండేవాడు. ఈ విషయం కూతురు రమా తమతో చెప్పగా సర్దిచెప్పి పంపిచామని తెలిపారు. ఇదే విషయంలో పంచాయతీ కూడా పెట్టామని, ఇక నుంచి తప్పు చేయనని సురేష్ భరోసా ఇచ్చాడని తెలిపారు. శుక్రవారం కూతురుతో గొడవ చేయగా వేదింపులు భరించలేక గన్నేరు రసం తాగి వాంతులు చేసుకుంటుండగా చికిత్స నిమిత్తం సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన కూతురు మృతికి అల్లుడు సురేష్ కారణమని ఫిర్యాదు రావడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్ తెలిపారు.

కేసీఆర్ జనజాతరకు బయలుదేరిన నాయకులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డు నుంచి శంకర్ రావు ఆధ్వర్యంలో మంచిర్యాలలో నిర్వహించిన కేసీఆర్ జనజాతర సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ సంక్షేమ పథకాలు, చేసినా అభివృద్ధి ఎవరు చేయలేరని, ఈ సందర్భంగా పేర్కొన్నారు. కేసీఆర్ అంటే ఓ నమ్మకం అని, రాబోవు పార్లమెంటు ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ భారీ మెజార్టీతో గెలిపించే దిశగా ఏర్పాటుచేసిన జనజాతర సభకు నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడవ వార్డు అధ్యక్షులు శంకర్ రావు, వార్డు నాయకులు చొప్పదండి రమేష్ వెళ్లారు.

ప్రతిభకు పేదరికం అడ్డు కాదు

నవతెలంగాణ-జన్నారం



ప్రతిభకు పేదరికం అడ్డు రాదని, అఖిల భారత విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్ బీజేపీ జన్నారం మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు అన్నారు. శనివారం మండలంలోని పొన్కల్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు సూర్యం కుమార్తె రాగుల అక్షయ ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో టాపర్గా నిలిచారు. దీంతో అక్షయను, వారు వేరువేరుగా శాలువాతో సత్కరించారు. శ్రీరాముల గంగాధర్ రూ.వేయి బహుమతి ప్రధానం చేశారు. బీజేపీ జన్నారం మండల నాయకులు అభినందించారు. పేదరికం చదువుకు అడ్డు కారాదని, అక్షయ ఉన్నత చదువులు చదవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, హరీష్, నవీన్, నాగరాజు, అంజన్న, వినయ్ పాల్గొన్నారు.

పనివేళలు మార్చాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన

నవతెలంగాణ-మందమర్రి

కార్మికుల పనివేళలు మార్చాలని ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఏరియాలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలపైన నమోదవుతున్న నేపథ్యంలో కార్మికులకు ఏఐటీయూసీ అండగా నిలిచింది. అధిక ఉష్ణోగ్రతల వలన కార్మికులు అస్వస్థకు గురయ్యే ప్రమాదం ఉన్నందున పని చేసే సమయాలను మార్చాలని నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మాట్లాడుతూ ఎండీ తీవ్రతను దష్టిలో పెట్టుకుని పని సమయాలను మార్చాలని అధికారులకు అనేక సార్లు మెమోరాండం ఇచ్చామని పనివేళలు మార్చకపోతే అర్థ నగ్న ప్రదర్శనలు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి సహాయ కార్యదర్శి సుదర్శన్, నాయకులు కంది శ్రీనివాస్, ప్రభాకర్, సంపత్ బానయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ రాజేష్ యాదవ్, పిట్ కమిటీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మందమర్రిలో..

నస్పూర్ : అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఓపెన్ కాస్ట్ గనులలో షిఫ్ట్ సమయాల్లో మార్పు చేయాలని కోరుతూ సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శనివారం ఎస్ఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా మాట్లాడుతూ తెలంగాణలోని ఏడు జిల్లాలలో ఇప్పటికే 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, తెలంగాణ ఆరోగ్యశాఖ పరిస్థితి తీవ్రతను నొక్కి చెబుతూ వడగాళ్ల ప్రభావం ఉందని ఆరెంజ్ అలర్ట్ కూడా జారీ చేయడం జరిగిందన్నారు. ఈ విపరీతమైన ఉష్ణోగ్రతల ప్రభావం కోల్డ్ బెల్ట్ ప్రాంతంలో ఎక్కువగా ఉంటుందని, ఇప్పటికే ఓపెన్ కాస్ట్ గనులలో ఉద్యోగులు అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి మోతే లచ్చయ్య, గండి సతీష్, మోహన్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఇత్తినేని శంకర్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జైపూర్ : గత పదిహేను రోజుల నుంచి ఎండలు మండిపోతున్నందున ఓపన్‌కాస్ట్ గని, సీహెచ్‌పీ ఉద్యోగుల పని వేలల్లో మార్పులు చేపట్టాలని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి బాజీ సైదా డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇందారం ఓపన్‌కాస్ట్ గని మేనేజర్‌ను కలిసిన వినతి పత్రం అందజేశారు. ఓసీ గనులతో పాటు సీహెచ్‌పీ ఉద్యోగులు అనారోగ్యాలకు గురి కవాల్సివస్తోందని, వాతావరణంలో చోటు చేసుకుంటున్న పరినామాల నేపథ్యంలో షిప్టు సమయాల్లో మార్పులు చేయాలని ఏఐటీయూసీ కోరుతోందని తెలిపారు. షిప్టు సమయాల్లో మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నినసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఓపన్‌కాస్ట్ గని పిట్ కార్యదర్శి ధరణి దేవేందర్, ఆఫీస్ బేరర్ నాగభూషణం, ఇందారం-1ఏ గని పిట్ కార్యదర్శి నవీన్ రెడ్డి, శ్రీనివాస్, మనోహర్, శ్రీనివాస్‌రెడ్డి, పద్మరాజ్, శ్రీనివాస్, పోచం పాల్గొన్నారు.



నస్పూర్‌లో..



జైపూర్‌లో..

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రజలు సహకరించాలని, స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ ఎ రవికుమార్ అన్నారు. శనివారం ఆయన పోలీసు బలగాలతో పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలందరూ తమ ఓటు హక్కుని నిర్భయంగా సద్వినియోగం చేసుకునే విధంగా పట్టణంలో కొత్త తిమ్మాపూర్, గద్దెరాగడి, అమ్మగార్డెన్ ఏ పరిదిలో పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు ఎన్నికల నియమావలి పాటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు, తమ ఓటు హక్కును వినియోగించుకుని, పోలీసులకు సహకరించాలని ఈ కవాతు నిర్వహించడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఇన్స్‌పెక్టర్ విపన్ కుమార్, పట్టణ ఎస్ఐ రాజశేఖర్, కాసిపేట్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లోకి న్యాయవాదులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కోర్టులో పనిచేసే పలువురు న్యాయవాదులు అడ్వకేట్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసేవా భవన్‌లో అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం వారందరికీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్క ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసినవారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, ప్రతి కార్యకర్తకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరినవారిలో న్యాయవాదులు మేకల మధుకర్, సంజయ్‌కుమార్, డి.నాగేశ్వర్, డిఎస్పి శర్మ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఏ.సంతోష్ కుమార్, టి.వెంకట్ కుమార్, షేక్ మన్సీర్, కే.రవీందర్, బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ సెక్రటరీ ముజాహిద్ హుస్సేన్, ఎం.నరేందర్, బి.రాము, గులాం ఇమ్రాన్, ఎస్.భగవాండ్లు, ఆర్.ప్రశాంత్, ఠాకూర్ కౌశిక్, మహమ్మద్ సాబీర్, సద్దాంబీన్ మహమ్మద్, నలగంటి నవీన్‌కుమార్ ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా శనివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనింగ్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి అధికారులకు సూచనలు చేశారు. బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాట్లలో బ్యాలెట్ పేపరు, అభ్యర్థులకు కేటాయించబడిన ఎన్నికల గుర్తులు తదితర వాటిని పరిశీలించారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 13న జరుగనున్న పోలింగ్ కోసం ఈవీఎంలను అన్ని విధాలుగా సిద్ధం చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈవీఎంలను అన్ని రకాలుగా సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎన్నికల అధికారులు ఉన్నారు.

సుగుణక్కను భారీ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-తలమడుగు

కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి సుగుణక్కను భారీ మెజారిటీతో గెలిపించాలంటూ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో శ్రీ పులాజీ బాబా ధ్యానం మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గతంలో నీటి సమస్యను పరిష్కరించామని, కాంపౌండ్ వాల్ నిర్మించామని, ధ్యాన మందిర అభివృద్ధి కొరకు ప్రభుత్వం తరపున రానున్న రోజుల్లో అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆత్రం సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, మాజీ జడ్పీటీసి బొల్లారం బాబాన్న, మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రకాష్‌రావు, కాంగ్రెస్ నాయకులు గంగారాం, తిరుపతి, గోక భూమారెడ్డి, పోశెట్టి, రావుల నారాయణ, నల్ల పద్మాకర్‌రెడ్డి, కాటిపెల్లి సునీతారెడ్డి, హన్మాండ్లు, పొచ్చన్న, ప్రమోద్, వెంకట్ యాదవ్, ఇంద్రసేన్‌రెడ్డి పాల్గొన్నారు.



నేడు సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించే పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం బీజోన్ సెంటర్ రాంనగర్ బస్తిలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బ్రతకాలన్న భారత రాజ్యాంగం ఉండాలన్న రిజర్వేషన్లు ఉండాలన్న సీపీఐ బలపరుస్తున్న ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పనిచేస్తున్న మతోన్మాద బీజేపీని ఓడించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, పెరుక సంపత్, కాదండి సాంబయ్య, రాంనగర్ శాఖ కార్యదర్శి తోకల రాజన్న పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల భారీ ర్యాలీ



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో శనివారం, ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రామాలయం నుంచి, బస్టాండ్ వరకు, భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం, పొన్కల్ గ్రామంలో కార్నర్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను గెలిపించాలని ప్రజలకు సూచించారు. మూడోసారి ప్రధాని మోడీని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జి మధుసూదన్ రావు, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షులు బద్రి నాయక్, మాజీ అధ్యక్షుడు గోలిచందు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బెడద గోపాల్, యువ మోర్చా అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు రాగుల సూర్యం, బొంతల మల్లేష్, బుర్ర గడ్డ జగన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఉప్ప నవీన్ గత నెలలో బహ్రెయిన్ దేశంలో ఉపాధి కూలీగా పనికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు శనివారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన వంతు సాయంగా రూ.5వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, మండల అధ్యక్షులు దోనికేని దయానంద్, జనరల్ సెక్రెటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, నాయకులు తోట సత్యం, నేరేళ్ల సత్యనారాయణ, గౌర్రె గంగాధర్, జహీర్‌ఖాన్, మాదిరే సత్యనారాయణ, శేషాద్రి, రాజేందర్, షౌకత్ పాషా, సతీష్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయిస్తాం

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీని గెలిపించండి ● బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

నవతెలంగాణ-కాసిపేట



పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణను అత్య ధిక మెజార్టీతో గెలిపిస్తే ఎంపీ, ఎమ్మెల్యేలుగా మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.500 కోట్లు మంజూరు చేయిస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొండాపూర్ యాపలో నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో ఆయన చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణతో పాల్గొని మాట్లాడారు. సొమ్ము ఒకరిది, సోకు ఒకరిదిగా బీఆర్ఎస్ మాట్లాడుతుందని విమర్శించారు. జైపూర్ పవర్ ప్లాంట్ కోసం మా నాయన కాకా వెంకటస్వామి, నేను అప్పటి కాంగ్రెస్ పెద్దలు మన్మోహన్ సింగ్, సోనియమ్మలతో మాట్లాడి ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఆ ఘనత మాదే అని బీఆర్ఎస్ చెప్పుకోవడం సొమ్ము ఒకరిది, సోకు ఒకరది అన్నట్లు ఉందని విమర్శించారు. 2005లో ఉపాధి హామీ, 2006లో ఇందిరమ్మ ఇండు ప్రవేశ పెట్టిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీదేనని, ఉపాధి హామీ పథకానికి రూ.400 పెంచుతున్నట్లు, ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులను ప్రజలపై మోపిందని, ఇంటింటికి నల్లా అని రూ.60 వేల కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్షల కోట్లు అవినీతి చేసిందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.3 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని పదేళ్లుగా ప్రజలను మోసం చేసిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు పదేళ్లుగా అనేక అవినీతులకు పాల్పడ్డాయన్నారు. ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని చేతి గుర్తుకు ఓటు వేసి వంశీ కృష్ణను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య నా సమస్యని, ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య లేకుండా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకుఏ కృషి చేస్తానని పేర్కొన్నారు. కేవలం ప్రజా సేవ కోసమే రాజకీయాలకు వచ్చానని, విశాఖ చాటిటేబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇసుక దందా, భూ కబ్జాలు చేస్తూ పేద ప్రజల కడుపు కొడుతూ అక్రమంగా సంపాదించుకున్నారని విమర్శించారు. గతంలో రైతులకు రుణ మాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఈ ఆగస్టు 15లోపు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ విప్ నల్లాల ఓదెలు, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి గడ్డం జగన్నాథం, మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ సింగిల్ విండో చైర్మన్ పూస్కూరి వంశీధర్ రావు, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, నాయకులు బండి ప్రభాకర్, రాపర్తి శ్రీనివాస్, నస్పూరి నర్సింగ్, సపాట్ శంకర్, పుర్ర కుమార్, ఉత్తూరి సత్తయ్య, మైదం రమేష్, గోలేటి స్వామి, రాజమౌళి, ఆల్క రాజు, మాజీ సర్పంచులు సునీత, దేవి, స్వరూప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు తెలంగాణ మాదిగ హక్కుల దండోరా మద్దతు



నవతెలంగాణ-జన్నారం

పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల మద్దతు బీఆర్ఎస్‌కు ఉంటుందని మాదిగ హక్కుల దండోరా ఖానాపూర్ ఇన్‌చార్జి కొండుకూరి ప్రశాంత్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ప్రశ్నించే గొంతుక, ఆత్రం సక్కుని గెలిపించాలని ఆయన కోరారు. తెలంగాణలో మాదిగలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఎంపీ సీటు ఇవ్వలేదన్నారు. ఆ పార్టీని చిత్తుగా ఓడించాలని మాదిగ సమాజాన్ని కోరుతున్నామన్నారు. గతంలో ఏబీసీడీ వర్గీకరణ చేస్తానని చెప్పిన బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎస్సి వర్గీకరణ చేయకుండా కమిటీ వేయడం అనేది తెలంగాణ మాదిగల ఓట్ల కోసమేనని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు బలహీనవర్గాల అభివృద్ధికి తోడ్పడిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దళిత రత్న అవార్డు గ్రహీత కొండుకూరి రాజు, మండల నాయకులు వెల్పుల రాజేష్, మైలరపు దుర్గేష్, చెవుల మద్ది నాగరాజు, సిలుముల గణేష్ పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్లకు మైనార్టీ నాయకుల సన్మానం

నవతెలంగాణ-జన్నారం

ఇంటర్ పరీక్షా ఫలితాలలో మంచి మార్కులతో ప్రతిభ కనబరిచిన మైనారిటీ అమ్మాయిలకు శనివారం మండల కేంద్రంలో మైనారిటీ నాయకులు సన్మానం చేశారు. మైనారిటీ, ఇంటర్ టాపర్లు అయిన మదీనా నాజ్, ఆనం అఫ్రోజ్, కరీనా, తమన్నా నాజ్, ఈషా శాజిలిలను ఘనంగా సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఉన్నత స్థాయిలో ఉంటేనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మహ్మద్ రియాజొద్దీన్, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫసి ఉల్లా, పొన్కల్ మాజీ ఉపసర్పంచ్ మోసిన్‌ఖాన్, జన్నారం ఏఎంసీ మాజీ డైరెక్టర్ రజాక్, ప్యాక్స్ డైరెక్టర్ సాధుపాషా, రియాసత్ అలీ అజ్మత్ ఖాన్, పసియుద్దీన్ మక్బూల్ జియావుద్దీన్, తహసన్ అలీ పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | మే 05, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి అండగా ఉంటా : ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ



అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత లక్కంపూర్ గ్రామానికి చెందిన జానకిరామ్‌కు అండగా ఉంటామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇల్లు పూర్తిగా దగ్ధమైన విషయం తెలుసుకున్న ఆయన శనివారం ఇంటిని పరిశీలించారు. జానకిరామ్‌ను పరామర్శించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద ఘటన నివేదిక అందించాలని కొరారు. జానకిరామ్‌కు తక్షణ సాయం అందించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఎంపిపి రాథోడ్ సజన్, సాబ్లే నానాక్‌సింగ్, డాక్టర్ జహీర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శివారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం దిలావర్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో మండల కేంద్రానికి చెందిన షేక్ అబ్దుల్ ఖాధీర్ (54) తన టీఎస్ 01 టీజీ 4694 నెంబరు గల టీవీఎస్ ఎక్సెల్ రోడ్డు పై వెళుతుండగా వెనక నుంచి టీఎస్ 18 హెచ్ 6628 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై వస్తున్న ఎడ్లన్నోళ్ల రవి అతివేగంగా, అజాగత్తగా నడుపుకుంటూ వచ్చి టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి బలంగా ఢీ కొట్టాడు. ఖదీర్ తల, ముక్కుకు తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యలో కామారెడ్డి సమీపంలో ఖదీర్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన ఆదె శంకర్‌బాయి కుమారుడు ఆదె డేవిడ్(18) నెలలు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వీరి ఇంటి ప్రక్కన వారి బంధువైన ఆదె పూజాబాయి కొత్త ఇల్లు నిర్మించుకుంటుంది. ఇంటి పనికి సెంట్రింగ్ పని కోసం తన సొంత పాత ఇంటిలో ఉన్న మెయిన్ బోర్డు నుండి కనెక్షన్ తీసుకొని పని చేయించుకుంటుంది. ఈ క్రమంలో బాలుడు ఇంటిలో నుండి బయటకు వెళ్లి ఆడుకుంటుండగా ఇంటి నిర్మాణం పనికి సెంట్రింగ్ రాడ్లు కోయడానికి ఉపయోగిస్తున్న వైరుకు తట్టుకున్నాడు. దానికి ఉన్న టేపును తీసివేయడంతో కరెంట్ షాక్ తగిలి అక్కడే పడిపోయాడు. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన కాగజ్‌నగర్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పుడికే మృతిచెందినట్టు తెలిపారు. బాలుడి తల్లి శంకర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ రాములు పేర్కొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఐదు గ్యారంటీలు తప్పక అమలు

కాంగ్రెస్ నాయకులు చొప్పరి సదానందం, దొడ్డ బాలాజీ

నవతెలంగాణ-ముత్తారం

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 5 న్యాయ గ్యారంటీలను ప్రవేశ పెడతామని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షు డు దొడ్డ బాలాజీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో ప్రజలను, ఉపాధి హామీ కూలీలను వారు కలిసి పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు కోడ్ తరువాత 2 లక్షల రైతు రుణమాఫీ అమలు చేయడం జరుగుతుందని అన్నారు. సోనియా గాంధీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా5 న్యాయ గ్యారంటీలను ప్రవేశపెట్టడం జరిగిందని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి పంటకు కనీస మద్దతు ధర, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూపాయలు 400 పెంపు, ప్రతి పేద కుటుంబ మహిళకు ఏటా 1 లక్ష రూపాయలు, ఆరోగ్య బీమా 25 లక్షలు, యువతకు 30 లక్షల ఉద్యోగలు కలిపించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గోవిందుల పద్మ ఆనంద్, ముత్తారం సింగల్ విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య, ముత్తారం మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు వాజిద్ పాషా, ముత్తారం మండల కిసాన్ సెల్ అధ్యక్షులు గాదం శ్రీనివాస్, ఓడేడు గ్రామ శాఖ అధ్యక్షులు దాసరి చంద్రమౌళి,తదితరులున్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

నవతెలంగాణ-ముత్తారం

ముత్తారం మండలం పారుపల్లి గ్రామానికి చెందిన జెల్ల రాజేశ్వరీ (25) పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకుందని ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. రాజేశ్వరీ గత కొన్ని నెలల నుండి కడుపునొప్పితో బాధపడుతుండేదని, ఆర్థిక ఇబ్బందుల వలన హాస్పిటల్లో చూపించుకోలేదని, కడుపునొప్పి బాధ భరించలేక ఈ నెల 3న ఐదు గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈ మేరకు మృతురాలి తండ్రి ఇండ్ల సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్ఐ ఆది మధుసూదన్ రావు తెలిపారు.

ఎంపీవోను విధుల నుంచి తొలగించాలి

నవతెలంగాణ-ముత్తారం

ముత్తారం ఎంపీవో వేణుమాధవ్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే ఆయన్ని విధుల నుంచి తొలగించాలని ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన బొల్లంపల్లి సంతోష్ గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీలో గల ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోతున్నాయని పలుమార్లు ముత్తారం ఎంపీవోకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, పంచాయతీకి ట్రాక్టర్, వాటర్ ట్యాంక్, పది మంది సిబ్బంది, 10 బోర్లు ఉన్నప్పటికీ నీరు పట్టడం లేదని, దీంతో మూడు ఎకరాలు ఉన్న పల్లె ప్రకృతి వనంలోని చెట్లు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా రంగయ్య పల్లె వద్ద పంచాయతీ కరెంట్ మీటర్‌తో నడుస్తున్న ప్రభుత్వ బోరు ద్వారా ఎంపీవో వేణుమాధవ్ ఇసుక క్వారీల నిర్వహకులకు రోడ్లపై దుమ్ము లేవకుండా నీళ్లు ఇస్తున్నాడని, దీని కోసం రూ.50వేలు తీసుకున్నాడని ఆరోపించారు. ఇదేమిటి అని ప్రశ్నిస్తే కరెంట్ మీటర్ బిల్లు, వాటర్ ట్యాంక్ నిర్వహణ చేసే వ్యక్తి కడతాడనంటూ చెబుతున్నారని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడమే కాకుండా, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఎంపీవోను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆయన ఉన్నతాధికారులను కలిసి డిమాండ్ చేశారు.

మూతపడే సింగరేణిని బీఐఎఫ్ఆర్ నుంచి కాపాడిన ఘనత కాంగ్రెస్ పార్టీది

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్

నవతెలంగాణ-గోదావరిఖని

మూతపడే సింగరేణిని బీఐఎఫ్ఆర్ నుంచి కాపాడిన ఘనత కాంగ్రెస్ పార్టీదని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి గోదావరిఖనికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి కార్మికుల మీద కపట ప్రేమ చూపించి కాంగ్రెస్ పార్టీపై అసత్యపు ఆరోపణలు చేశారని అన్నారు. సింగరేణి కార్మికులు వారి మాట నమ్మరని, ఎలాగైతే మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని కోల్‌బెల్ట్ వ్యాప్తంగా చిత్తుగా ఓడించారో, ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓడిస్తారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సొమ్ము 30వేల కోట్ల వరకు వాడుకొని, ఒక్క నూతన బొగ్గు గనిని కూడా ఏర్పాటు చేయలేదని, మొన్నటి వరకు బీజేపీతో అంటకాగారని, బీజేపీ ప్రభుత్వానికి అన్ని విషయాల్లో సహకరించి, నోట్ల రద్దుకు, జీఎస్టీ బిల్లుకు, రైతు చట్టాలకు కూడా మద్దతు ఇచ్చారని, 2015లో బీఆర్ఎస్ ఎంపీలో పార్లమెంట్‌లో ఎంఎండీఆర్ యాక్ట్‌కి మద్దతు తెలిపి సింగరేణి ప్రైవేట్ పరం కావడానికి కారకులయ్యారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలి

● గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ-నేరడిగొండ

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఆదివాసుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల పని అయిపోయిందని అన్నారు. ఈ సారి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని అన్నారు. ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. కుప్టి ప్రాజెక్టు నా బాధ్యత అని అన్నారు. బోథ్ నియోజకవర్గానికి లాకాలేజ్ మంజూరు చేస్తానని అన్నారు. 10 సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వం ఎటువంటి హామీలు నేరవేర్చలేదని మండిపడ్డారు. మోడీ హయంలో ప్రభుత్వ ఆస్తులన్నీ అంబానీలకు అమ్మేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పరిపాలించిన ఎటువంటి ఫలితం లేదని, ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ



అభ్యర్థి అత్రం సుగుణ, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : తొలి ఆదివాసీ మహిళా అభ్యర్థి, మానవ హక్కుల కోసం పోరాడిన ఉద్యమకారిణి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకే తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఉషాకిరణ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేండ్లలో బీజేపీ పెట్టుబడిదారులకు కొమ్ము కాసిందని, నిత్యావసరాల ధరలు పెంచిందని, పేద, మధ్యతరగతి ప్రజల నడ్డివిరిచిందని మండిపడ్డారు. ఆదివాసీల ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చిందన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేయడానికి బదులు మనువాద సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చిందన్నారు. ప్రజల పక్షపాతి అయిన కాంగ్రెస్‌ను గెలిపించి, రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలన్నారు. ఆత్రం సుగుణకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లం దేవరాయ, ఆర్గనైజింగ్ కార్యదర్శి వలువాయి శ్రీను, సురేష్ దేవరాయ, లంబాడీ కోకన్వీనర్ పాల్య నాయక్, గోండ్ కన్వీనర్ రాందాస్ పాల్గొన్నారు.



శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. క్రాంతినగర్‌లో అనుమతులు లేకుండా రోడ్డు పక్కన ఒక మతానికి సంబంధించిన జెండా గద్దెను నిర్మించారన్నారు. అనుమతులు లేవని పట్టణ మున్సిపాలిటీ అధికారులు రోడ్డుకు ప్రమాదకరంగా ఉందని తీసే ప్రయత్నంతో జరిగిన ఘటనలో ఒక వర్గం వ్యక్తులు చట్ట వ్యతిరేకంగా గుమిగుడి, మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేసి మతసామరస్యాన్ని చెడగొట్టే విధంగా ప్రవర్తించిన ఇరు వర్గాలపై కేసులను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, రెచ్చగొట్టే విధంగా, ప్రవర్తించిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీసులు అప్రమత్తమై శాంతి భద్రతలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ సంఘటనలో శాంతి భద్రతలను విఘాతం కలిగించే వారిని అందరినీ గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. ఎటువంటి జెండాలు, విగ్రహాల ఏర్పాటుకు సంబంధిత శాఖ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున అనుమతులు లేకుండా గుమ్మిగూడిన, ఎటువంటి ర్యాలీలు, సభలు నిర్వహించిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేదింటి ఆడబిడ్డను భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పేదల పక్షాన పోరాడే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించుకుందామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ఓ పంక్షన్ హాలులో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో పద్మశాలి సంఘం సభ్యులు చేట్‌పల్లి గంగయ్య, సారంగపాణి, వీరయ్య, రమేష్, శంకరయ్య, లచ్చన్న, సత్తన్న, రాజన్న, తిరుపతి, అంజన్న, భాస్కర్, తిరుపతి, తదితరులు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలో సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలంతా ఆత్రం సుగుణ గెలుపు కోసం కలిసికట్టుగా ఉండి రాత్రింబవళ్లు కష్టపడి పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ఈ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో జరగబోయే రాహుల్ గాంధీ సభకు కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్ద ఎత్తున తరిలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నేటి యువత అన్ని సేవా కార్యక్రమాలలో ముందుండాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద ఇంటర్నేషనల్ ఓమౌజయ యునైటెడ్ యంగ్ స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్పీ మ్యాస్ట్రో వారి మార్గదర్శకత్వంలో ఐఎయువైఎస్ఎ వారు చేస్తున్న సేవలు అమోఘమని పేర్కొన్నారు. వేసవి కాలం కావడంతో రహదారి వెంట ప్రయాణించే ప్రయాణికుల దాహార్తిని తీర్చడం మంచి ఆలోచనను తెలిపారు. నేటి యువతకు వీరిస్తున్న మార్గాన్ని, సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శైలేశ్వర్, జిల్లా నాయకులు సత్యనారాయణగౌడ్, సామ రెడ్డి, సాయి, దిలావర్‌పూర్ ఓమౌజయ యూత్ సభ్యులు పురుషోత్తం పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-నార్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గణేష్ రాథోడ్, మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శనివారం పార్టీ మండల నాయకులతో కలిసి మాన్యాపూర్, గంగాపూర్, తాడిహత్నూర్‌తో పాటు తదితర గ్రామాల్లో గ్రూపుల వారీగా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరుపున ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, నాయకులు ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, కరీంఖాన్, మహేందర్, భీంరావ్ పటేల్, మాజీ సర్పంచ్ మధుకర్ రాథోడ్, మోతీరాం పటేల్, యాదవ్ రావ్, బాదిరావ్ ఉన్నారు.

మండలంలో పూర్తయిన హోమ్ ఓటింగ్

నవతెలంగాణ-లక్ష్మణచాంద



పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన హోమ్ ఓటింగ్ ప్రక్రియ మండలంలో శనివారం పూర్తయింది. ఈ నెల 13న పార్లమెంట్ సాధారణ ఎన్నికలు జరుగనున్న విషయం అందరికీ తెలిసిందే. కాగా వికలాంగులు, 80 ఎండ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దె ఓటింగ్ నిర్వహించే అవకాశాన్ని భారత ఎన్నికల సంఘం కల్పించింది. మండలంలో మొత్తం మీద 14 మంది ఓటర్లు హోమ్ ఓటింగ్ కోసం ధరఖాస్తు చేసుకోగా అధికారులు ఈ ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ అధికారులు కాశీరాం, శ్రీనివాస్, నరేశ్ రాథోడ్, సిబ్బంది గోలి సుజాత పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని గంగన్నపేట్ గ్రామంలో శనివారం కాంగ్రెస్ నాయకులు గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన జడ్జిని కలిసిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన ప్రభాకర్‌రావును జిల్లా కలెక్టర్ రాజర్షిషా కలిశారు. శనివారం జిల్లా కోర్టులోని జడ్జి ఛాంబర్‌లో నూతన జడ్జి ప్రభాకర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై కాసేపు చర్చించారు.



ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సు వేళల్లో మార్పులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ లహరి ఏసీ, సూపర్ లగ్జరీ బస్సు సమయాల్లో స్వల్పంగా మార్పులు చేయడం జరిగిందని డిపో మేనేజర్ కల్పన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లహరి బస్ సమయం 11.30, 13.15, 21.30, 22.30 ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఆర్టీసీ సూపర్ లగ్జరీ సమయం 4.00, 4.50, 5.40, 7.45, 8.35, 9.30, 10.50, 13.50, 16.10, 18.50, 20.55, 21.50, 23.00, 23.30 సమయాలకు మార్చడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ ప్రయాణికులు గమనించాలని కోరారు.